## వైభవంగా రథోత్సవం



కందుకూరు ,ఏప్రిల్ 7: కందుకూరులో రథోత్సవం నిర్వహించారు. చెన్నకేశవ ఆలయంలో సీతారాముల కల్యాణం నిర్వహించిన మరుసటి రోజు రథోత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. అందులో భాగంగా సోమవారం ఉదయం రథంపై సీతారాముల విగ్రహాలనుంచి రథానికి తాడును బిగించి గ్రామస్తులు ప్రజలు భక్తులు జైశ్రీరామ్ అంటూ గ్రామంలోని పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు.

## ఘనంగా శోభాయాత్ర



ఆర్కేపురం, ఏప్రిల్ 7 : ఆర్కేపురం డివిజన్ వాసవి కాలనీలోని అష్టలక్ష్మి దేవాలయంలో శ్రీ మహాలక్ష్మి యాగం అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా మొదటి రోజు శోభాయాత్ర వేలాది మంది భక్తుల మధ్యన కనుల పండుగగా కొనసాగింది. ఈ కార్యక్రమంలో దేవాలయం ఫౌండర్ చైర్మన్ గౌరిశెట్టి చంద్రశేఖర్ గుప్తా, చైర్మన్ సోమ సురేశ్‌గుప్తా, ప్రధాన కార్యదర్శి జగన్, కోశాధికారి అయిత అంజయ్య గుప్తా, నాగమల్ల శ్రావణ్ కుమార్, దాచేపల్లి శ్రీనివాస్, బంధం దామోదర్ పాల్గొన్నారు.

## దరఖాస్తులు చేసుకోండి



సైదాబాద్ ఏప్రిల్ 7 : రాజీవ్‌యువ వికాసం పథకానికి సంబంధించిన దరఖాస్తులను స్వీకరించే కేంద్రాన్ని సోమవారం హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్ సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువ వికాసం దరఖాస్తులను తీసుకోవడానికి ప్రతి వార్డు కార్యాలయంలో ఒక కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని, ఇక్కడ లబ్ధిదారులు తమ దరఖాస్తులకు సంబంధించిన జిరాక్స్‌లను అందజేయాలని సూచించారు.

# నాలా పనులు పూర్తి చేయండి



నబిల్ కాలనీలో ఎస్‌ఎన్‌డీపీ నాలా పనులను పరిశీలిస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

పహాడీషరీఫ్ ఏప్రిల్ 7 : జల్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని నబిల్ కాలనీలో ఎస్‌ఎన్‌డీపీ నాలా పనులు త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి సూచించారు. సోమవారం జల్‌పల్లి మున్సిపల్ కమిషనర్ వెంకట్రాం, డీఈ అయిషాతో కలసి నబీల్ కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంట్రాక్టర్ త్వరగా పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. రానున్న వర్షాకాలంలోపు పనులు పూర్తి చేయాలన్నారు. ఈ ప్రాంతంలో నివసిస్తున్న ప్రజలు స్థానిక సమస్యలతో ఎంతగా ఇబ్బందులను అనుభవిస్తున్నారో గుర్తించాలన్నారు. అభివృద్ధి పనులను త్వరగా ప్రారంభించి పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలన్నారు. ఎస్‌ఎన్‌డీపీ అధికారులు, మాజీ కౌన్సిలర్లు పల్లపు శంకర్, షైక్ అఫ్జల్, సూరెడ్డి కృష్ణా రెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు ఖైసర్ బామ్, అబ్దుల్లా గాలిబ్, కాలనీవాసులు పాల్గొన్నారు.

## కళారంగాల్లో పిల్లలను ప్రోత్సహించాలి

తెలుగుయూనివర్సిటీ, ఏప్రిల్ 7 : అక్షయ సామాజిక, సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో ఆబిడ్స్ బొగ్గులకుంటలోని తెలంగాణ సారస్వత పరిషత్తు ఆడిటోరియంలో పలువురికి ఉగాది పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా చిన్నారి కళాకారులు ప్రదర్శించిన కూచిపూడి నత్య ప్రదర్శనలు ఆహూతులను మంత్రముగ్ధలను చేశాయి. అడిషనల్ డీసీపీ రాందాస్‌తేజ, నృత్య గురువులు డాక్టర్ రేవతి, డాక్టర్ చింతాకృష్ణప్రియ, డాక్టర్ చల్లా యామిని, డి. సంధ్యలక్ష్మి, వై. తులసి, ఎ. సంధ్యారాణి, మెట్రో టీవీ అధినేత జయప్రసాద్ పాల్గొని ఆయా రంగాలలో రాణిస్తున్న వారికి ఉగాది పురస్కారాలను ప్రదానం చేసి సత్కరించారు. చి న్నారులను ప్రోత్సహించడంలో తల్లిదండ్రుల పాత్ర కీలకమని వక్తలు తెలిపారు. పురస్కారగ్రహీతలను ప్రోత్సహించేలా పురస్కారాలు అందించడం ముదావహమని సంస్థ నిర్వాహకుడు సీహెచ్ సీతారామ్ కృషిని ప్రశంసించారు.

# సీసీ రోడ్లు ప్రారంభం



సీసీరోడ్లు ప్రారంభించిన మంత్రి శ్రీధర్‌బాబు, ఎంపీ ఈటల, ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

చంపాపేట/వనస్థలిపురం: సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. సోమవారం ఎల్బీనగర్ నియోజకవర్గం పరిధి కొత్తపేట, మన్సూరాబాద్, లింగోజిగూడ, వనస్థలిపురం, హస్తినాపురం డివిజన్ల పరిధిలలోనీ పలు కాలనీలలో, బస్తీలలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభ కార్యక్రమాల్లో భాగంగా మంత్రి శ్రీధర్ బాబు లింగోజిగూడ డివిజన్ లోని సీఎం రోడ్డు పక్కనున్న గౌతమ్ నగర్ లో ఇటీవల రూ.5 కోట్ల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్లను మంత్రి శ్రీధర్ బాబు ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి,రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్ రెడ్డి రామ్ రెడ్డి, మాజీ ఎంపీ మధుయాష్కీగౌడ్, స్థానిక కార్పొరేటర్ ధర్పల్లి రాజశేఖర్ రెడ్డి, ప్రభుత్వ పలు విభాగాల అధికారులతో కలిసి ప్రారంభించారు. వనస్థలిపురం, హస్తినాపురం డివిజన్‌లో రూ. 30 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులను ప్రారంభించారు.

మన్సూరాబాద్: మన్సూరాబాద్ డివిజన్ వివేకానందనగర్ కాలనీ సహారాస్టేట్స్ మొదటి గేటు వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమానికి సోమవారం సాయంత్రం జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబు హాజరై ఎంపీ ఈటల రాజేందర్‌తో కలిసి హయత్‌నగర సర్కిల్–3 పరిధిలోని మన్సూరాబాద్ డివిజన్, హయత్‌నగర్ డివిజన్, నాగోల్ డివిజన్, బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో రూ. 21.17 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు.

**మంత్రి కార్యక్రమంలో తోపులాట**

ఎల్బీనగర్: ఎల్బీనగర్ నియోజకవర్గంలో ప్రారంభోత్సవాలు, శంకుస్థాపన కార్యక్రమంలో మూడు పార్టీల నాయకుల నినాదాలతో తోపులాట జరిగింది.

## డిగ్రీ కళాశాలలో వార్షిక క్రీడా దినోత్సవం

హయత్ నగర్, ఏప్రిల్ 7 : హయత్ నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వార్షిక క్రీడా దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మార్చి 5 నుంచి 18 వరకు నిర్వహించిన క్రీడల్లో 150 మందికి పైగా విద్యార్థులు పాల్గొనగా విజేతలకు బహుమతులు అందజేశారు. వాలీబాల్, కబడ్డీ, ఖో–ఖో, క్రికెట్, అథ్లెటిక్స్ 100 మీటర్లు, 400 మీటర్లు, 1500 మీటర్లు, లాంగ్‌జంప్, షాట్ పుట్, చెస్, క్యారమ్స్, పురుషులు, మహిళలు ఇద్దరికీ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ సురేశ్‌బాబు విద్యార్థులు క్రీడలు, ఆటలలో పెద్ద సంఖ్యలో పాల్గొన్నందుకు వారిని అభినందించారు. విజేతలకు బహుమతులను అందజేశారు. ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ కె. అనిత 2024–25 సంవత్సరానికి క్రీడా నివేదికను చదివారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి, ఇందిర, డాక్టర్ నాగేంద్ర, డాక్టర్ అపర్ణ, విద్యా సమన్వయకర్త డాక్టర్ బి. నర్సింహ, ఇతర బోధన సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రత్యేక రాయితీతో పుస్తకాల విక్రయం

తెలుగుయూనివర్సిటీ, ఏప్రిల్ 7: సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం ప్రచురించిన గ్రంథాలను ప్రత్యేక రాయితీతో విక్రయించడానికి పుస్తక ప్రదర్శనను ఏర్పాటు చేస్తున్నట్లు రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హనుమంతరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 8వ తేదీ నుంచి 17వ తేదీ వరకు నాంపల్లి ప్రాంగణంలో గల పుస్తక విక్రయ కేంద్రంలో ప్రతి రోజూ ఉదయం 10 నుంచి సాయంత్రం 5గంటల వరకు తెరిచి ఉంటుందని అన్నారు. ప్రతి పుస్తకంపై 60 శాతం వరకు రాయితీ ఇవ్వనున్నట్లు ఆయన వెల్లడించారు. ప్రాచీన గ్రంథాలు, సాహి త్యం, నిఘంటువులు, సంగీత, నృత్య గ్రంథాలు, భారత, భాగవతాలు, ప్రబంధాలు, పురాణాలు, పంచకావ్యాలు, ఇతిహాసాలు, చరిత్ర గ్రంథాలు, పోటీ పరీక్షలకు ఉపయోగపడే పుస్తకాలు తగ్గింపు ధరలలో విక్రయానికి సిద్ధంగా ఉంటాయని, సాహితీవేత్తలు, పరిశోధకులు, విద్యార్థులు, భాషా ప్రి యులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

# వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా ర్యాలీ



ర్యాలీ లో పాల్గొన్న ముస్లింలు

పహాడీషరీఫ్, ఏప్రిల్ 7: కేంద్రం ముస్లిం వ్యతిరేక విధానాలను అవలంభిస్తూ వక్ఫ్ భూములను అన్యాక్రాంతం చేయడానికి ప్రయత్నిస్తుందని పలువురు ముస్లిం మతపెద్దలు ఆరోపించారు. సోమవారం బాలాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని షాహీన్ నగర్ లో వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా శాంతియుతంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్లిం మతపెద్దలు మాట్లాడుతూ కేంద్రం వక్ఫ్ ఆస్తులపై దాడి చేస్తూ ముస్లింలను భయ భ్రాంతులకు గురి చేస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఈ బిల్లును వెనక్కి తీసుకోవాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా ముస్లింలను ఏకమై ఈ బిల్లుకు వ్యతిరేకంగా తమ స్వరం వినిపించాలని కోరారు. ఏప్రిల్ 13న హైదరాబాద్ ట్యాంక్ బండ్ వద్ద భారీ నిరసన కార్యక్రమం చేపడుతామని తెలిపారు.ఈ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా మహేశ్వరం ఏసీపీ లక్ష్మీకాంత్ రెడ్డి, బాలాపూర్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్ నేతృత్వంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

## రాజ్యాంగాన్ని అవహేళన చేస్తున్న మోదీ



జై భీమ్ కార్యక్రమంలో పాల్గొన్న కృష్ణ నాయక్

కందుకూరు , ఏప్రిల్ 7: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ రాజ్యాంగాన్ని అవహేళన చేసున్నారని మార్కెట్ కమిటీ చైర్మన్ సభావత్ కృష్ణ నాయక్ తెలిపారు. పార్టీ ఆదేశాల మేరకు సోమవారం మండల పరిధిలోని గుమ్మడవెల్లి, మాదాపూర్ గ్రామాల్లో జై బాబు, జై భీమ్ ,జై సవిధాన్ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతూ మత విద్వేషాలకు బీజేపీ ప్రభుత్వం పునాది వేస్తుందన్నారు. రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేస్తూ దేశ ప్రజల హక్కులను కాలురాస్తుందని వివరించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ మాజీ ఫ్లోర్ లీడర్ ఏనుగు జంగారెడ్డి, మాజీ జడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, కోఆర్డినేటర్ ఎండీ అఫ్జల్ బేగ్,యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సొడపు వెంకటేశ్‌గౌడ్, ఢిల్లీ శ్రీధర్ ముదిరాజ్, అందుకుల సత్యనారాయణ, నరసింహ చారి, అజీజ్, డైరెక్టర్లు విష్ణువర్ధన్ రెడ్డి, సురేందర్ , జగన్, బుక్క పాండురంగారెడ్డి ,సులేమాన్ ,పల్స జగన్ గౌడ్, మంద సాయిలు ,శ్రీనివాసు ,మహేందర్, శ్రీకాంత్, బాబు ,కుమార్ ,యాదగిరి ,శేఖర్ పాల్గొన్నారు.

## ఇంజినీరింగ్ విభాగం హెడ్ గా ప్రొఫెసర్ సతీశ్‌కుమార్

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాలలోని ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగం హెడ్ గా ప్రొఫెసర్ పి సతీష్ కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన హెడ్ గా సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనను విద్యార్థులు కలిసి పుష్పగుచ్ఛం తో స్వాగతం తెలిపి శాలువాతో సత్కరించారు. . ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నాయకుడు తోట శ్రీనివాస్, పరిశోధక విద్యార్థులు రవీందర్, వినోద, భాగ్య తదితరులు పాల్గొన్నారు.

# ఉత్సవ మూర్తుల ఊరేగింపు



ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో ఉత్సవ ఊరేగింపులో పాల్గొన్న ఆలయ కమిటీ సభ్యులు

మలక్ పేట, ఏప్రిల్ 7: శ్రీరామ నవమిని పురస్కరించుకొని ముసారాంబాగ్‌పాత మలక్ పేట డివిజన్ల లోని పలు దేవాలయాల్లో ఉత్సవమూర్తుల ఊరేగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. శాలివాహన నగర్ లోని ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయం, గడ్డి అన్నారంలోని భక్త హనుమాన్ దేవాలయం, మలక్ పేట మార్కెట్లోని గరుడ అభయాంజనేయ స్వామి దేవాలయాల్లో ఉత్సవ మూర్తుల ఊరేగింపు కార్యక్రమాన్ని కనుల పండువగా నిర్వహించారు. ఊరేగింపుల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని జానకి రాములకు పల్లకీ సేవలను నిర్వహించారు. ఉత్సవ మూర్తుల ఊరేగింపుతో శ్రీరామనవమి వేడుకలు సంపూర్ణమైనట్లు పూజారులు పేర్కొన్నారు.



సీతారాముల ఉత్సవ మూర్తులను తీసుకువస్తున్న ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు

## చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ గీతా ప్రవీణ్

ఉప్పల్, ఏప్రిల్ 7:చిల్కానగర్ డివిజన్ లోని ఆర్యసమాజ్, తపస్య ఫౌండేషన్ ఉప్పల్ ఆచార్య వేదసింధు ఆధ్వర్యంలో పిస్తా హౌస్ చౌరస్తాలో సర్వే ఆఫ్ ఇండియా వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సోమవారం కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్ సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు ప్రవీణ్ ముదిరాజ్, కొండల్ రెడ్డి,జగన్, మహమూద్, వేణుగోపాల్ రెడ్డి, బాలు, శ్యామ్ తపస్య ఫౌండేషన్ సభ్యు లు మహేందర్, నరసయ్య, సత్యవతి, ఉన్నారు.

# ఆరోగ్యాన్ని మించిన ఆస్తి లేదు




సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి శ్రీదేవి

ఆర్కే పురం, ఏప్రిల్ 7 : జిల్లా న్యాయ సేవాసంస్థ, రంగారెడ్డి వారి ఆధ్వర్యంలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం న్యాయ విజ్ఞాన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి శ్రీదేవి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేటి కాలంలో, ప్రజలు ఆరోగ్యంగా లేకపోవడానికి అతిపెద్ద కారణం జంక్ ఫుడ్ తీసుకోవడం. చాలా మంది రెడీమేడ్ ఫుడ్ , అవుట్‌డోర్ ఫుడ్‌ను ఇష్టపడతారు ఎందుకంటే అవి రుచికరంగా, సులభంగా లభిస్తాయన్నారు. జంక్ ఫుడ్ అనేక రకాల రసాయనాలతో తయారు చేయబడిందని, చాలా వ్యాధులు రావడానికి ఇదే అతిపెద్ద కారణమని పేర్కొన్నారు. మనం ఆరోగ్యంగా ఉండాలనుకుంటే, మనం ఎల్లప్పుడూ ఆరోగ్యకరమైన ఆహారాన్ని తినాలన్నారు. ఆరోగ్యకరమైన జీవనశైలిని గడపాలి. సంతోషకరమైన జీవితాన్ని గడపడానికి ఆరోగ్యం చాలా అవసరమన్నారు. ఆరోగ్యకరమైన మానవ శరీరం అన్ని ఆనందాలకు ప్రధాన మూలమని తెలిపారు. ప్రజలు దీనిని గొప్ప వరంలా అంగీకరించాలన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని ప్రపంచ ఆరోగ్య దినోత్సవ అవకాశాన్ని ఉపయోగించి ప్రపంచ ఆరోగ్యం యొక్క ప్రాముఖ్యత గురించి ప్రజలు తెలుసుకోవాలని తెలిపారు. రంగారెడ్డి జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ 'ప్రపంచ ఆరోగ్య దినోత్సవం ప్రతి సంవత్సరం ఏప్రిల్ 7న ప్రపంచవ్యాప్తంగా నిర్వహిస్తారని తెలిపారు. ఆరోగ్య దినోత్సవం యొక్క ముఖ్య ఉద్దేశం, ప్రపంచవ్యాప్తంగా అందరికీ ఆరోగ్య సంరక్షణ సౌకర్యాలను అందించడం, ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించడం ఆరోగ్యానికి సంబంధించిన అత్యంత ముఖ్యమైన అంశాలను ప్రపంచవ్యాప్తంగా చర్చించామన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం యొక్క ఉద్దేశం కేవలం ఆరోగ్య సంస్థలకు పరిమితమైనది కాదు, ప్రతి వ్యక్తి, కుటుంబం , సమాజానికి దోహదపడేందుకు అవసరమైన చర్యలు తీసుకోవడానికి అవగాహన పెంచడం జరుగుతుందన్నారు. ఆరోగ్యకరమైన జీవనశైలి, సరైన ఆహారం, వ్యాయామం, మానసిక ప్రశాంతత అనేవి మన ఆరోగ్యానికి అత్యంత ముఖ్యమైన అంశాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు విష్ణువర్ధన్ రావు, ప్రముఖ విద్యావేత్త వసుధారాణి తదితరులున్నారు.

## శ్రీరామ నవమి ఉత్సవ కమిటీ ఏకగ్రీవం




ఉత్సవ కమిటీ సభ్యులను సన్మానిస్తున్న నిర్వాహకులు

కందుకూరు ఏప్రిల్ 7: మండల పరిధిలోని కొత్తగూడ శ్రీరామనవమి ఉత్సవ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కమిటీ అధ్యక్షుడిగా బొక్క బాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా సుధాకర్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా సొడపు శేఖర్ గౌడ్, సామ ప్రకాశ్‌రెడ్డి, కార్యదర్శులుగా తల్లోజు చంద్రశేఖర చారి, కోశాధికారిగా పుల్లగూరల తిరుపతిరెడ్డి, సలహాదారులుగా రాయి చెట్టు యాదయ్య, లోకేశ్వర్ రెడ్డి, నరేందర్ రెడ్డి, సత్యనారాయణ రెడ్డి, కుమ్మరి లక్ష్మయ్య , పిట్టల యాదయ్య, బొక్క హనుమంత్ రెడ్డి ఎంపికయ్యారు. కమిటీ రెండు సంవత్సరాలు కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీరామనవమి ఉత్సవాలను ప్రతి ఏటా ఘనంగా నిర్వహించడానికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సాద మల్లారెడ్డి, బొక్క సంజీవరెడ్డి, ప్రభాకర్ రెడ్డి, దామోదర్ రెడ్డి ,నాగేశ్వర్ రెడ్డి, దయాకర్ రెడ్డి, బాల్ రెడ్డి, ఎల్లారెడ్డి, లక్ష్మీనాచారి, శంకర్ గౌడ్ హనుమంత్ రెడ్డి ,లక్ష్మీపతి గౌడ్, బాల నరసింహ, మహే చారి ,బాలకృష్ణ పాల్గొన్నారు.

## రైల్లో దొంగతనం

కాచిగూడ, ఏప్రిల్ 7: కాచిగూడ రైల్లో ప్రయాణికురాలి నగదును గుర్తుతెలియని వ్యక్తి దొంగలించాడు. కాచిగూడ రై ల్వే సీఐ ఎల్లప్ప వివరాల ప్రకారం.. తమిళనాడులోని కన్యాకుమారికి చెందిన జ య స్పెషల్ రైల్లో కాచిగూడకు వస్తుండ గా డోన్ రైల్వే స్టేషన్ సమీపంలో గుర్తుతెలియని వ్యక్తులు ఆమె బ్యాగును దొంగిలించారు. అందులో రూ.18 వేలు ఉన్నట్లు తెలిపారు.

## సామూహిక సత్యనారాయణ వ్రతాలు



వ్రతంలో పాల్గొన్న ఆలయ కమిటీ ప్రతినిధులు

సైదాబాద్, ఏప్రిల్ 7 : మలక్ పేట బీ బ్లాక్ ప్రభుత్వ ఉద్యోగుల గృహ సముదాయంలోని శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో సోమవారం సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. శ్రీరామనవమి, హనుమాన్ జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని ఆలయంలో సామూహిక సత్యనారాయణ వ్రత కార్యక్రమాన్ని భక్తి శ్రద్ధతో నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ గంగాధర్, ప్రధాన కార్యదర్శి పాల మధుసూదన్, కోశాధికారి శంకర్, ప్రచార కార్యదర్శి డాక్టర్.ఎస్.విజయ భాస్కర్, ఉపాధ్యక్షులు అయిలయ్య, సలహాదారులు గుండా మల్లయ్య, కృష్ణారెడ్డి, సభ్యులు వేణు, చంద్రయ్య, హరినాథ్, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని భజన కార్యక్రమాలు నిర్వహించారు.

## 14న గిరిజన శక్తి రాజ్యాంగ రక్షణ ర్యాలీ

రవీంద్రభారతి, ఏప్రిల్ 7 : డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలను పురస్కరించుకొని బషీర్‌బాగ్ చౌరస్తాలోని బాబూజగ్జీవన్ రామ్ విగ్రహం నుంచి ట్యాంక్ బండ్‌పై గల , సచివాలయం పక్కన ఉన్న 125 అడుగుల అంబేద్కర్ విగ్రహం వరకు ఎసీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంఘాలు, విద్యార్థి సంఘాలతో భారీ ఎత్తున గిరిజన శక్తి ఆధ్వర్యంలో కళాకారులతో భారత రాజ్యాంగ రక్షణ భారీ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు గిరిజన శక్తి రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ వెంకటేష్ చౌహాన్ తెలిపారు. సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ర్యాలీకి దళిత బహుజనులు విద్యార్థులు, ప్రజా సంఘాలు భారీగా తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. కొండ్రపల్లి రమేశ్, సందీప్, నరేందర్ పాల్గొన్నారు.

## రూపాయికే వస్తువులు



సైదాబాద్, ఏప్రిల్ 7: రూపాయి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఐఎస్ సదన్ డివిజన్ పరిధిలోని సుబ్రహ్మణ్యం నగర్ బస్తీలోని కాచిగూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు రూపాయికే వివిధ రకాల విద్యా వస్తువులను రూపాయి ఫౌండేషన్ చైర్మన్ నాగమల్ల అనిల్ కుమార్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు అవసరమైన ఎగ్జామ్ ప్యాడ్, నోట్ బుక్, పెన్ను, పెన్సిల్, రబ్బర్, స్కేల్ ఏదైనా ఒక రూపాయికి అందజేయడమే లక్ష్యంగా పెట్టుకొని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అందజేస్తున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు రాజారావు అనిత కొంచెం నరసింహారావు బాలరాజు నేరెళ్ల ప్రసాద్ రావు నీలా వెంకటేశ్ జూలూరు శ్రీనివాస్ పాల్గొన్నారు.

## అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోండి

బోడుప్పల్, ఏప్రిల్ 7: బోడుప్పల్ నగరపాలక సంస్థ పరిధిలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని మేడిపల్లి మండల సీపీఐ కార్యదర్శి రచ్చ కిషన్ అన్నారు. ఈ మేరకు సోమవారం కమిషనర్ ఏ శైలజకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేషన్ నిధులకు భారీగా గండికొడుతూ చేపడుతున్న అక్రమ నిర్మాణాలపై అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారని, పరోక్షంగా సహకరిస్తూ అందిన కాడికి దండుకుంటున్నారని ఆయన విమర్శించారు. ఫిర్యాదు చేసిన వార్డులో ఏఐటీసీ మండల కార్యదర్శి దండు రమేశ్, నాయకులు మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

## చికిత్స పొందుతూ యువకుడు మృతి

పీర్జాదిగూడ ఏప్రిల్ 7: ప్రేమించిన అమ్మాయితో పెళ్లి కాలేదని ఓ యువకుడు పెట్రోల్‌తో నిప్పంటించుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడి చికిత్స పొందుతూ మృతి చెందాడు ఈ ఘటన మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది స్థానికుల కథనం ప్రకారం.. జవహర్‌నగర్‌కు చెందిన సాయి మేడిపల్లిలో ఉంటున్న ఓ యువతితో ప్రేమలో పడ్డాడు. ఈ క్రమంలో ఇరువురు పెద్దల మధ్య గొడవలు రావడంతో పెళ్లి కాలేదని తీవ్ర మనస్తాపానికి గురై ఈనెల 3న మేడిపల్లిలో ఉంటున్న యువత బంధువుల ఇంటి ముందు పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డా డు. తీవ్ర గాయాలైన బాధితుడిని స్థానికులు వెంటనే చికిత్స నిమిత్తం గాంధీ దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి కుటుంబ సభ్యుల నుంచి ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.